క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం రూ.11.13 లక్షలు



వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి హుండీ ఆదాయం లెక్కించారు. 99 రోజులకు స్వామి వారికి హుండీల ద్వారా రూ.11,13,186 సమకూరింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు కొండల అరుణ కుమారి, కూరాళ్ల రమాదేవి, శ్రీ కృష్ణ సేవా సమితి సభ్యులు, పలువురు సేవకులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని దేవదాయ ధర్మాదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు పర్యవేక్షించారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ

ఏలూరు టౌన్‌: తనకు చికిత్స చేయకుండానే చేసినట్టు వీడియో మార్ఫింగ్ చేసి జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం ఆరోగ్యశ్రీ నిధులు దోచేశారని స్పందనలో ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఆరోగ్యశ్రీ ఉమ్మడి పశ్చిమ కో–ఆర్డినేటర్ ఆంద్రూస్ బుధవారం ఏలూరులో విచారణ చేపట్టారు. బుట్టాయగూడెం మండలం గణపవరానికి గ్రామానికి చెందిన బాధితుడు ఎ.ఫ్రాన్సిస్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై ఆంద్రూస్‌ను వివరణ కోరగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామని, ఆస్పత్రి యాజమాన్యంతోనూ ఈ విషయంపై మాట్లాడామన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం విద్యార్థులు సంబంధిత వెబ్ సైట్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలని దీనికి ఈ నెల 10వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకూ అవకాశం ఉందని ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు కాపీని ప్రింట్ తీసుకుని తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూన్ 6న సాయంత్రం 5 గంటలలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

విజ్ఞానం, వినోదం ఒకే చోట

- ఆస్వాదిస్తున్న చిన్నారులు
- సెలవులు వృథా కాకుండా శిక్షణ
- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు





మహిళా గ్రంథాలయంలో చిత్రలేఖనం నేర్పుతున్న దృశ్యం, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మైదా పిండితో బొమ్మల తయారీలో శిక్షణ పొందుతున్న బాలలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చిన్నతనంలో ఆటలాడడానికి, టీవీలు, లేదా మొబైల్స్ చూడడానికి ఇష్టపడతాం. చదువుకునే వయసులో బడులకెళ్లి వచ్చినా దృష్టంతా వినోదంవైపే ఉంటుంది. వేసవి కాలం వచ్చిందంటే బడులూ ఉండవు, క్లాసులకూ వెళ్లక్కరలేదు. హోమ్ వర్కులూ ఉండవు. దీంతో ఎప్పుడూ ఆటలాడడం, టీవీలో, సినిమాలో చూడడం లేదా మొబైల్స్‌లో గేమ్స్ ఆడడంతోనే గడిపేస్తుంటారు విద్యార్థులు. ఇలా చేయడం వల్ల చదువు మర్చిపోయి బడులు తెరిచిన తరువాత మళ్లీ కొత్తగా చదువు మొదలు పెట్టిన భావనలో పడిపోతారు. చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతారు. అటువంటి పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. చిన్నారులకు విజ్ఞానంతో పాటు వినోదం కూడా ఒకే చోట అందించే విధంగా రూపొందించిన కార్యక్రమాలతో గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోంది. ఈ శిబిరాల్లో విద్యార్థులకు అప్పటి వరకూ పరిచయంలేని వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. దీంతో వారిలో ఆసక్తితో పాటు ఇష్టం కూడా ఏర్పడుతోంది. కొత్తగా మరో అంశంలోకి ప్రవేశం కలిగి ఉండబోతున్నామనే ఆలోచన వారిని మరింత ఉత్సాహపరుస్తోంది. తమ తోటి వారిలో తాము ప్రత్యేకం కాబోతున్నామనే సంతృప్తి వారిలో వ్యక్తమౌతోంది.

శిబిరంలో నేర్పే అంశాలివే..

గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, 12 పంపుల సెంటర్‌లోని మహిళా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులకు పేపర్ క్రాఫ్ట్, రిలాక్స్ గేమ్స్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, వేద గణితం, సంఖ్యా గణితం, బాల్యం నుంచి ఎదుగుదల అనే అంశంపై బాల వికాస తరగతులు, కథలు చదవడం, చదివిన కథలను ఇతరులకు వివరంగా అర్థమయ్యేలా చెప్పడం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. చదరంగంలో శిక్షణ, థియేటర్ ఆర్ట్, రంగస్థల నాటకాల్లో అనుభవం కోసం శిక్షణ, చిత్రలేఖనంలో శిక్షణ, కూచిపూడి, శాస్త్రీయ నృత్యాలు, పద్యాలు పాడడం, యోగా, మెడిటేషన్, ధ్వన్యనుకరణ (మిమిక్రీ) వంటి అంశాల్లోనూ శిక్షణ ఇవ్వడానికి నిపుణులైన వారు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.

కొత్త విషయాలు తెలుస్తున్నాయి



విజ్ఞాన శిబిరంలో చాలా విషయాలు నేర్పుతున్నారు. ఇప్పటి వరకు నాకు తెలియని విషయాలు అనేకం తెలుస్తున్నాయి. వివిధ అంశాల్లో విషయ పరిజ్ఞానం కలుగుతోంది. అన్ని విషయాలూ అర్థమయ్యేలా చెబుతున్నారు. ఇక్కడ నేర్పే అన్ని అంశాల్లో అవగాహన పెరుగుతోంది.

– బి.లహరి, 6వ తరగతి

గణితం సులభంగా అర్థమౌతోంది



వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడానికి ఇదొక మంచి అవకాశం. ఇక్కడ గణితంలో మెళకువలు నేర్పుతున్నారు. వాటిని గమనిస్తే లెక్కలు ఇంత సులభంగా చేయవచ్చా అనిపిస్తోంది. వాటితో పాటు కొన్ని క్రాఫ్ట్ వస్తువులు చేయడంలో ఇస్తున్న శిక్షణ ఉపయోగకరంగా ఉంటోంది. దాదాపు అన్ని విషయాలను నేర్పుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

– డీఎన్‌కే హర్ష, 9వ తరగతి

ఉత్సాహంగా వస్తున్నారు



వేసవి విజ్ఞాన శిబిరానికి బాలలు ఉత్సాహంగా వస్తున్నారు. వారిలో నేర్చుకోవాలనే తపన కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రంథాలయంలోని కథల పుస్తకాలు వారిని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. ఆ కథల్లోని నీతిని అర్థం చేసుకుంటున్నారు. దీని వల్ల వారు ఉత్తమ పౌరులుగా తమనుతాము తీర్చిదిద్దుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– యాగంటి శ్రీదేవి, మహిళా గ్రంథాలయం గ్రంథపాలకురాలు

దిశ యాప్ తోడుంటే.. పోలీస్ మీ వెంటే



మహిళల సెల్‌ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించిన సీఐ చంద్రశేఖర్, సిబ్బంది

మహిళలు, యువతుల సెల్‌ఫోన్లలో దిశ యాప్ ఉంటే.. పోలీస్ మీ వెంట ఉన్నట్టేనని ఏలూరు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ అన్నారు. ఏలూరు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు టూటౌన్ ప్రాంతంలో బుధవారం పెద్దెత్తున దిశ యాప్‌ను మహిళలు, యువతులు, విద్యార్థినుల సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు. ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై కె.ప్రసాద్, మహిళా కానిస్టేబుల్స్ టూటౌన్ ప్రాంతంలోని మార్కెట్ ఏరియా, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి మహిళ చేతిలోని ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళా భద్రతకు ప్రాముఖ్యత ఇస్తూ దిశ యాప్‌ను రూపొందించిందన్నారు. మహిళలకు ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే దిశ యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్‌ను నొక్కితే 10 నిమిషాల్లోనే రక్షణ కల్పిస్తామని చెప్పారు. దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవటం వల్ల మీ సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారానికి ఏ విధమైన ఇబ్బంది ఉండదని వివరించారు.

తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను కొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ఏలూరు (టూటౌన్): అకాల వర్షాలకు తడిసిన ధాన్యం, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి కోరారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహ అధ్యక్షతన బుధవారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రైతాంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తడిచిన ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని, రైతులకు గోనె సంచులు ఇవ్వాలని, రవాణాకు లారీలు ఏర్పాటు చేయాలని కోరారు. అకాల వర్షాలకు జరిగిన పంట నష్టాలను వెంటనే నమోదు చేసి పరిహారం అందించాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 31 వరకు ఇంటింటికీ రైతు సంఘం పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తిచేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు, చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, సిరిబత్తుల సీతారామయ్య, గుండపనేని సురేష్, అనుమోలు మురళీ, గంటా పాపారావు, పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిత్రకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు



జీవిత సాఫల్య పురస్కారాలు అందుకున్న చిత్రకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు ఆర్ట్ సొసైటీ ఏడో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రకళకు చేసిన విశేష సేవలకు గుర్తింపుగా పలువురు కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారం అందుకున్న వారిలో నర్సాపురానికి చెందిన మద్రాసు నివాసి సినీ పబ్లిసిటీ ఆర్టిస్ట్ కడలి సురేష్, ఏలూరు అంబికా ఆర్ట్స్ అధినేత మజ్జి కాంతారావు, శారదా ఆర్ట్స్ అధినేత ఎంపీ ఆచారి, విజయ ఆర్ట్స్ అధినేత ఎం.రామకృష్ణ, సాయిబాబా ఆర్ట్స్ ప్రతినిధి భోగాది రాంబాబు ఉన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఈడా చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్, అంబికా సంస్థల ఎండీ అంబికాప్రసాద్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి హాజరయ్యారు. తొలుత సుమారు 200 మంది భావిచిత్రకారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బహుమతులు, అవార్డులు అతిథుల చేతులమీదుగా చిన్నారులకు అందించారు. నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఏలూరు ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు మజ్జి కాంతారావు అధ్యక్షతన, కార్యదర్శి చిత్రాలయ రాంబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఆస్తి తగాదాలతో దాడి

ఏలూరు టౌన్‌: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో అన్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ముంగర రాజు గాయపడగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు అతని తమ్ముళ్లు నాగరాజు, దుర్గాప్రసాద్ తమపైనా దాడి జరిగిందంటూ హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి వైద్యం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముంగర రాజు ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన కైకలూరు సమీపంలోని ఆటపాకలో నివాసం ఉంటున్నారు. అతని సోదరులు రాజేంద్రప్రసాద్, నాగరాజు, దుర్గాప్రసాద్ ఏలూరు మండలం కోమటిలంకలో ఉంటున్నారు. కోమటిలంకలో వీరికి ఉమ్మడి ఆస్తిగా చేపలచెరువు ఉంది. ఈ చెరువు విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. బుధవారం కోమటిలంకలో ముంగర రాజు, నాగరాజు, దుర్గాప్రసాద్ గొడవపడ్డారు. ఈ ఘటనలో రాజు గాయపడగా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమ్ముళ్లు నాగరాజు, దుర్గా ప్రసాద్ కూడా హాస్పిటల్‌లో చేరటంతో ఎమ్మెల్సీ కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణపై కార్మిక సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం సంఘం కోకన్వీనర్ తొర్లపాటి బాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలను కాలరాస్తోందని విమర్శించారు. ఇటీవల కేంద్ర కార్మిక సంఘాలు ఢిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఆగస్టు 9న దేశ వ్యాప్తంగా హర్తాల్ నిర్వహించేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో కడపలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 18,19 తేదీల్లో ఏలూరులో నిర్వహించే ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభల విజయవంతానికి సహకరించాలని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా ఆందోళనలు చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కోకన్వీనర్ చాట్ల పుల్లారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రోత్సాహానికి రూ.లక్ష విరాళం



ప్రిన్సిపాల్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ఆచార్యులు దంపతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించే నిమిత్తం ఒక దాత కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కాలిఫోర్నియాకు చెందిన దివంగత చుండూరి వెంకటా చలపతి జ్ఞాపకార్థం ఆయన సోదరులు కాలిఫోర్నియాకే చెందిన చుండూరి రామకృష్ణ నరేంద్ర, సీహెచ్ ఆర్‌వీవీఎస్ ఆచార్యులు కలిపి సమకూర్చిన రూ.1లక్ష చెక్కును ఆచార్యులు దంపతులు బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీఎం ధనుంజయరావుకు అందజేశారు. రూ.1 లక్ష ఫిక్సిడ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వార్షిక వడ్డీని ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందించాలని కోరారు. చుండూరి సోదరులు గతంలో కూడా తమ కళాశాలకు రూ.లక్ష విరాళం అందించారని, వారి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రిన్సిపాల్ ధనుంజయరావు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	05-07
బెండకాయలు	26	కంద	48
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	34
కాకర కాయలు	40-44	కీరా దోస	30
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	40	అల్లం	200
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	30	పాలకూర	08-12
దొండకాయలు	24	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	26
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	13
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	14
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	17

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

దెందులూరు : టీడీపీవి అన్ని రాజకీయ లబ్ధి కోసం చేసే ఆరోపణలేనని, రికార్డు స్థాయిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా ఆందోళన చెందిన రైతన్నలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలబడిందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 21 రోజుల గడువు ఉన్నా 5 రోజులకే ధాన్యం కొనుగోలు సొమ్ములు జమ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 82.58 శాతం రైతులకు ప్రభుత్వం డబ్బులు విడుదల చేసిందన్నారు. ఏలూరు జిల్లా రైతులకు ఇప్పటి వరకు రూ.217 కోట్లు జమ చేసిన సంగతిని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. పంట కొనుగోలు విషయంలో ఏ సమస్య ఉన్నా ప్రతి రైతు తమను సంప్రదించవచ్చని, ప్రత్యేకంగా అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ నెంబర్ 1552518కి ఫిర్యాదు చేయవచ్చని ఎమ్మెల్యే సూచించారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ

దెందులూరు : జోగన్నపాలెం రైతు భరోసా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు రిజిస్టర్‌లను పరిశీలించారు. శాంపిల్స్, తేమ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు నేరుగా వారి ఖాతాలకు సొమ్ము జమ అవుతుందని, రవాణా ఖర్చుల సొమ్ము కూడా ఖాతాలకు జమవుతుందని ఆర్డీఓ రైతులకు వివరించారు. ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఏఓ గద్దె రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కొత్తపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : తన కుమార్తె కనపడడం లేదని ఓ తల్లి పోలీసులను ఆశ్రయించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రామశింగవరం గ్రామానికి చెందిన తాళ్ళూరి నిర్మలకు అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తితో కొంతకాలం క్రితం వివాహమైంది. ఈ నేపథ్యంలో గత నెలరోజుల నుంచి నిర్మలకు అనారోగ్యకారణంగా తల్లి జొన్నకూటి మరియమ్మ ఇంటి వద్ద ఉంటోంది. అయితే ఈనెల 9న ఉదయం 9 గంటల నుంచి కనపడడం లేదని చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు తారుమారు

పెదవేగి : ర్యాగింగ్ చేయడంతో విద్యార్థుల జీవితాలు తారుమారు అవుతాయని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.విక్రం రెడ్డి అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ్రడ డాక్టర్ జి విక్రం రెడ్డి, ఏలూరు సర్కిల్ ఎస్ఈబీ సీఐ డి.ప్రసాద్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ర్యాగింగ్ చేయడం వలన జీవితాన్ని పాగొట్టుకునే పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రమాదముందని అన్నారు. దీంతోపాటు తోటి విద్యార్థులకు వారి చదువులకు ఆటంకం కలిగే అవకాశం ఉందని, కావున ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ ర్యాగింగ్ జోలికి పోవద్దని విద్యార్థులకు సూచించారు. అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ స్లీవరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీడియం సి ట్రస్ట్ మెంబరు ఫాదర్ ఐ మైకేల్, నర్సింగ్ కళాశాల సెక్రెటరీ ఫాదర్ పి.జాకబ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత తప్పనిసరి

పెదవేగి : మండల పరిధిలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత పాటించాలని తహసీల్దార్ ఎన్ నాగరాజు అన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 123 ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డుల నిర్వహణ, వంటగది, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహణ బాగుందని కార్యకర్త కష్టవేణిని అభినందించారు.